బొల్లారం రోడ్ల పై జనం



పండుగ సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

బొల్లారం: దీపావళి పండుగ సందర్భంగా బొల్లారం ప్రాంతం సందడిగా మారింది. రోడ్డుకు ఇరువైపులా పండుగ సామగ్రి విక్రయించే దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.ముఖ్యంగా టిమ్స్ ఆస్పత్రి ఎదురుగా గ్రామాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు, కొనుగోలు దారులతో రద్దీగా మారింది. లాల్‌బజార్‌లోని మహంకాళి ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు కూడా జనంతో నిండిపోయాయి. కొన్ని టపాసుల దుకాణాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.





అమీర్‌పేట్‌లో ప్రమిదలు, ఇతర పూజాసామగ్రి, బొమ్మల కొలువుకు అవసరమయ్యే వస్తువులు, వస్త్రాలు, బంగారు ఆభరణాల కొనుగోళ్లు





దివ్వెల పండుగకు అంతా సిద్ధం..



సనత్‌నగర్: వెలుగుల పండుగ దీపావళి జోష్ మొదలైంది. నియోజకవర్గంలోని వీధులన్నీ పండుగ సందడిని సంతరించుకున్నాయి. కొనుగోలుదారులతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. ఇంటింటా వెలుగులను ప్రసరింపజేసేందుకు కనువిందు చేసే ప్రమిదలు మార్కెట్‌ను ముంచెత్తాయి. వీటి కొనుగోలు కోసం మహిళలు పోటీపడ్డారు. విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో వ్యాపారులు వాటి ధరలకు రెక్కలు తొడిగారు.సాధారణంగా సైజును బట్టి జత ప్రమిదలు రూ.5ల నుంచి రూ.10లు ఉండగా వ్యాపారులు రూ.30ల నుంచి రూ.40లకు పెంచి అమ్మారు. అలాగే స్టెప్స్ ప్రమిదలు అయితే ఏకంగా రూ.100లకు విక్రయాలు చేశారు. ఇక మైనంతో నింపిన ప్రమిదలు అమ్మకాలు జోరందుకున్నాయి. వీటికి భిన్నంగా మార్కెట్లోకి వచ్చిన ఎలక్ట్రానిక్ ప్రమిదలు సైతం హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. సనత్‌నగర్, అమీర్‌పేట్,బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్ల పరిధిల్లో ఏ రహదారి చూసినా ప్రమిదలు, లక్ష్మీపూజకు అవసరమైన పూలు, ఇతర సామగ్రి అమ్మకదారులు, కొనుగోలుదారులతో కిక్కిరిసాయి. అలాగే స్వీట్స్‌తోనే దీపావళికి అసలైన మజా అన్నట్లుగా స్వీట్స్‌షాపుల వద్ద కొనుగోలుదారులు బారులుదీరారు. తమ ఆత్మీయులకు, కుటుంబసభ్యులకు స్వీట్స్‌బాక్స్‌లను అందజేసి శుభాకాంక్షలు తెలిపేందుకు రెడీ అయ్యారు. వ్యాపారులు దీపావళి స్వీట్స్‌ను కళ్లు జిగేల్‌మనేలా ప్యాకింగ్ చేసి మైమరపిస్తున్నారు. అలాగే పలు సంస్థల యాజమాన్యాలు తమ సిబ్బందికి బోనస్‌లు ఇవ్వడంతో పండుగ ఖుషీ రెట్టింపయ్యింది. దీపావళి అనగానే గుర్తుకొచ్చేది బొమ్మల కొలువు. విభిన్న ఆకృతుల్లో ఆకట్టుకునే శైలిలో బొమ్మలు కొనుగోలుదారులను కనువిందు చేశాయి. వీటి కొనుగోలుకు మహిళలు ఆసక్తికనబరిచారు. అలాగే పండుగ సందర్భంగా వస్త్ర, బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

నింగికెగిసేలా టపాసుల వెలుగులు..

- బాణాసంచా దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మినీకాశీగా పేరొందిన సనత్‌నగర్‌లో ఈసారి దాదాపు 100కు పైగా దుకాణాలు వెలిశాయి. ఇవి కాకుండా బల్కంపేట్, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్ తదితర ప్రాంతాల్లో లెక్కకు మిక్కిలిగా దుకాణాలు ఏర్పాటుచేసి అమ్మకాలు జరుపుతున్నారు. అన్ని షాపుల్లోనూ ఫ్యాన్సీ టపాసులే. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా బాణాసంచా కొనుగోళ్లు జోరుగా సాగిస్తున్నారు. కొత్తగా వచ్చిన టపాసుల గురించి ఎక్కువగా ఆరా తీయడం కనిపించింది.

గుమ్మెత్తిన పూల ధరలు...

- దీపావళి సందర్భంగా పూల అమ్మకాలు జోరందుకున్నాయి. సనత్‌నగర్ నియోజకవర్గంలోనే టన్నుల కొద్ది పూల అమ్మకాలు సాగాయి. ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్, మోండా మార్కెట్ తదితర ప్రాంతాల్లో పూల విక్రయాలు విరివిగా జరిగాయి. వినియోగదారుల అవసరాన్ని బట్టి వ్యాపారులను ధరలను అమాంతం పెంచేశారు. దీంతో మామూలు రోజుల్లో కంటే రెట్టింపు ధరకు పూలను విక్రయించడంతో వినియోగదారులు నోరెళ్లబెట్టారు. కిలో బంతి పూల ధరలు రూ.150-200ల వరకు పలకడం గమనార్హం.

ఓయూ పోలీసు స్టేషన్ ఎదుట వాహనాలు



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ ముందు, స్టేషన్ చుట్టూ ప్రదేశం వాహనాల పార్కింగ్‌కు కేరాఫ్ అడ్రాస్‌గా మారింది. ఆరు నెలల క్రితం పోక్సో కేసులో పట్టుబడ్డ ఓ ట్రావెల్స్ బస్‌ను పోలీసు స్టేషన్ ముందే పార్క్ చేసి వదిలేశారు. ఇటీవల 18 టైర్ల వాహనం ఓ లారీని సైతం పీఎస్ వద్ద రోడ్డుపై వదిలేశారు. ఇలా వివిధ కేసులతో సంబంధం ఉన్న వాహనాలను తీసుకొచ్చి ఓయూ పోలీసు స్టేషన్ చుట్టు పార్క్ చేసి వదిలేస్తున్నారు. ఓయూ క్యాంపస్‌కు వెళ్లే విద్యార్థులు, అధ్యాపకుల రాకపోకలకు పీఎస్ ముందు రోడ్డుకు ఇరువైపుల నిలిపి ఉన్న వాహనాలతో ఆటంకంగా మారాయి. వీటిని పట్టించుకునే వారు కరువయ్యారు. కేసుల పరిష్కారం అయ్యేదెప్పుడు ఈ వాహనాలు పోలీసు స్టేషన్ ముందు రోడ్డుపై నుంచి తొలగించేదెప్పుడో తెలియడం లేదు. రోడ్లపై నిలిపిన వాహనాలను అక్రమ పార్కింగ్ అంటూ క్లిక్ క్లిక్ అనీ ఫొటోలు కొట్టే ట్రాఫిక్ పోలీసులకు ఓయూ పోలీసుల స్టేషన్ ఎదుట రోడ్ల పక్కన నెలల తరబడి భారీ వాహనాలను నిలిపి ఉంచితే కనిపించడం లేదా అని పలువురు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

22 నుంచి కార్తీక మాస విశేష పూజలు

- నవంబర్ 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రతిరోజూ సాయంత్రం ఆకాశదీపారాధన
- సనత్‌నగర్ శ్రీహనుమాన్ దేవాలయం, శివాలయంలో ఏర్పాట్లు

సనత్‌నగర్: శ్రీహనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శివాలయంలో కార్తీకమాస విశేష పూజలను ఈ నెల 22 నుంచి నవంబర్ 20 వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు రిపుంజయ శర్మ ఆధ్వర్యంలో ప్రతిరోజూ విశేష పూజలతో పాటు సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీపారాధన ఉంటుందని పేర్కొన్నారు. నవంబర్ 2న సాయంత్రం 6 గంటలకు సహస్ర జ్యోతిర్లింగార్చన, 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా రాత్రి 7 గంటలకు జ్వాలా తోరణం, ప్రత్యేక అర్చన, 9న అన్నపూజ, సాయంకాలం దర్శనం, 18న మాస శివరాత్రి సందర్భంగా ఉదయం 5.30 నుంచి 10.30 వరకు సామూహిక అభిషేకాలు, సాయంత్రం 6.30 గంటలకు ప్రదోషకాల అభిషేకం, అలంకరణ దర్శనం, 19న ఉదయం సామూహిక అభిషేకాలు, అనంతరం ఉదయం 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన కార్యక్రమాలు, 20న అమావాస్య రుద్రహోమం, పూర్ణాహుతి జరుగుతాయని వివరించారు.



శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో..

- శ్రీహనుమాన్ దేవాలయం ప్రాంగణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 22 నుంచి నవంబర్ 20 వరకు నెల రోజుల పాటు శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేకంగా నిత్య సహస్రనామార్చన (నిత్యార్చన) జరుగుతుంది. నవంబర్ 1న కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, 2న క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా సామూహిక సాలగ్రామ-దీప-వస్త్ర-ఫల-స్వయంపాక దానములు జరిపించబడతాయని ఈఓ తెలిపారు. 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా సహస్ర దీపాలంకరణ జరుగుతుందని వివరించారు.

రహదారి విస్తరణలో న్యాయం చేయాలి

- – బీ3 యజమానుల డిమాండ్





బస్టాప్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బీ3 భూమి యజమానులు

బొల్లారం: రాజీవ్ రహదారి విస్తరణలో కంటోన్మెంట్ పరిధిలోని బీ3 కేటగిరీ భూమి యజమానులు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏడాది నుంచి సుమారు 86 మంది మెయిన్‌రోడ్ ప్రాపర్టీ యజమానులు కంటోన్మెంట్ బోర్డు, మేడ్చల్ కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వినతిపత్రాలు అందజేసినా, ఇప్పటి వరకు హామీ ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో లాకడవాలా బస్టాప్ వద్ద సమావేశం నిర్వహించారు. అనంతరం భూ యజమానులు ర్యాలీగా వెళ్లి రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సమావేశానికి జేఏసీ చైర్మన్ సతీష్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీ3 కేటగిరీ భావన యజమానులు కూడా రాజీవ్ రహదారి ప్రాజెక్ట్‌లో భాగమే. వీరికి కూడా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించి, తగిన నష్టపరిహారం ఇవ్వాలి. కార్యక్రమంలో బాధితులు, శ్రీకుసుమ్, విశాల్, శ్రీకాంత్, విక్టోరియా, ఈశ్వర్‌గౌడ్, డా.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘అది దళిత ప్రజలపై జరిగిన దాడి’



లాలాపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి దేశంలోని దళిత ప్రజలందరిపై జరిగిన దాడిగా చూస్తున్నామని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ అన్నారు. ఈ నెల 27న నిర్వహించతలపెట్టిన దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. ఆదివారం ఓయూలోని దూర విద్యా కేంద్రం ఆడిటోరియంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ ఆధ్యక్షతన మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంద కృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆత్మగౌరం కంటే మాకు ఏది ముఖ్యం కాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్, రాష్ట్ర అధికార ప్రతినిధి శేఖర్, డా. సుధాకర్, చిరంజీవి, ముకేష్ మాదిగ, మహేశ్, రాజు తదితరులున్నారు.

వరద బాధితులకు డ్రై కిట్స్ పంపిణీ



అడ్డగుట్ట: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో వరద బాధితులైన ర్యాక్ పిక్కర్స్,హెయిర్ పిక్కర్స్, గృహ కార్మికులకు ఆదివారం డ్రైకిట్స్ పంపిణీ చేశారు. అడ్డగుట్ట డివిజన్‌లోని మొండిబండ, లోహియానగర్ తదితర ప్రాంత వాసులకు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, హైదరాబాద్ జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పులి కల్పన, బీఎస్పీ నేత జోగు ఈశ్వర్‌లు 35 మంది వరద బాధిత కుటుంబాలకు అందజేశారు. దోమ తెరలు, సబ్బులు, శానిటరి న్యాప్‌కిన్స్, బకెట్, బ్రెష్, పేస్టులు తదితర వస్తువులు ఓ సంస్థ ద్వారా అందించినట్లు తెలిపారు. పేదలను ఆదుకోవడానికి మానవతా వాదులు ముందుకు రావాలని డీబీఎఫ్ కార్యదర్శి శంకర్ కోరారు.

జాగ్రత్తలు పాటిస్తూ పండుగను జరుపుకోవాలని

చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి

సికింద్రాబాద్: ప్రజలందరూ జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దీపావళి సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు వారి పిల్లల వెంటే ఉండాలన్నారు. అదే విధంగా టపాసులు కాల్చుతున్నప్పుడు సమీపంలో ఇసుక, నీళ్లు, బ్లాంకెట్ మొదలైన అత్యవసర సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సౌండ్ తక్కువ వచ్చే వాటిని కాల్చితే బాగుటుందన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం టపాసులు రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య సమయంలో మాత్రమే కాల్చాలన్నారు.











విద్యా రంగ సమస్యలపై చర్చ



తెలంగాణ విద్యా కమిషన్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూనివర్సిటీ విద్యార్థులు

లాలాపేట: ఓయూ విద్యార్థి సంఘాల నేతలు ఆదివారం తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్‌ను వారి కార్యాలయంలో కలిశారు. విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ప్రొ. విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేష్, ప్రొ.పద్మజాషాలతో సమావేశమయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నియంతృత్వ విధానాలను ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా విద్యా శాఖకు మంత్రిని నియమించాలి, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీ చేపట్టాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి ప్రతీ సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. రీసెర్చ్ స్కాలర్‌కు నెలకు రూ. 25 వేల ఫెలోషిప్ ఇవ్వాలని, యూనివర్సిటీలో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులపై పెట్టిన కేసులన్నింటిని ఎత్తివేయాలన్నారు. ఈ సమావేశంలో ఓయూ విద్యార్థి సంఘాల నేతలు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.

అంతిమయాత్ర రథం వాహనం వితరణ



సమావేశంలో పాల్గొన్న మాణికేశ్వర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ ద్వారా మాణికేశ్వర్‌నగర్ బస్తీకి అంతిమయాత్ర రథం వాహనాన్ని వితరణగా ఇవ్వాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఆ వాహనం నిమిత్తం రూ. 50 వేలు గండికోట కుమార్ అందజేయగా, ఇతర సభ్యులు తమ వంతు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ సమావేశంలో మాణికేశ్వర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.కుమార్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి అంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోదాస్ నరసింహ, జాయింట్ సెక్రటరీ హరి, కోశాధికారి పి. శ్రీనివాస్, ఆర్గనైజర్ వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణ్‌కుమార్ తదితరులున్నారు. అంతిమయాత్ర రథానికి ఆర్థికసాయం అందించిన గండికోట కుమార్‌ను అసోసియేషన్ ఘనంగా సన్మానించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం

డిప్యూటీ మేయర్



లాలాపేట: హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని, వారి సేవలు దీపావళి దీపాల్లా వెలుగులు నింపుతున్నాయని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. దీపావళి పర్వదిన వేడుకలను పురష్కరించుకొని ఆదివారం తార్నాకలోని తన నివాసం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ హైదరాబాద్ ప్రజలందరికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పంజగుట్ట: త్వరలోనే నిమ్స్ అభివృద్ధి కోసం కూల్చివేస్తున్న ఎర్రమంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు కలుసుకునానరు. 1989 బ్యాచ్ విద్యార్థినీ విద్యార్థులు కలుసుకుని ఆటాపాటలతో సందడి చేశారు. ఎర్రమంజిల్ పాఠశాలను నిమ్స్ అభివృద్ధి కోసం కేటాయించగా మెగా ఇంజినీర్స్ వారు ఎర్రమంజిల్ ప్రధాన రహదారిపై మరో పాఠశాల కట్టించారు. ఆ పాఠశాల ఇటీవలే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభమయ్యింది. దీంతో విద్యార్థులకు గత వారం రోజులుగా తరగతులు కొత్త పాఠశాలలోనే జరుగుతుండడంతో పాత పాఠశాల నిమ్స్ వారు త్వరలోనే కూల్చేయనున్నారు. అందుకే తాము చదువుకున్న పాఠశాలలో ఒకరోజు గడుపుదామని వచ్చినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా బిట్టు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సునంద రెడ్డి, కార్యదర్శిగా ప్రేమ్‌రాజ్‌ను ఎన్నుకున్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం నిరసన

బంజారాహిల్స్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జూబ్లీహిల్స్ డివిజన్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మెంగా శ్యామ్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో నిరసన వ్యక్తం చేశారు. ఫిలింనగర్ మహనీయుల చౌరస్తాలోని జ్యోతిరావు పూలే, సావిత్రీబాయిపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నేతలంతా 42 శాతం రిజర్వేషన్ల కోసం నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టబద్ధత తీసుకురావాలని ఈ సందర్భంగా శ్యామ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు కల్పించకపోతే బీసీల పోరాటం రోజురోజుకూ ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కుల, మతాలు, పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ బీసీ రిజర్వేషన్‌కు మద్దతు ప్రకటించాలని అన్నారు.







రెండు వారాలుగా డ్రైనేజీ ఓవర్‌ఫ్లో

పట్టించుకోని జలమండలి సిబ్బంది



తుకారాంగేట్ సాయినగర్‌లో ఇళ్ల ఎదుట డ్రైనేజీ మురుగునీరు

అడ్డగుట్ట: తుకారాంగేట్ సాయినగర్‌లో రెండు వారాలుగా డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతూ ఇళ్ల ముందు మురుగునీరు ప్రవహిస్తున్నా.. కూడా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అడ్డగుట్ట డివిజన్‌లోని తుకారాంగేట్ మీనా హాస్పిటల్ వీధిలో సుమారు పదిహేను రోజులుగా డ్రైనేజీ మురుగునీరు పొంగిపొర్లుతున్నాయి. దీంతో స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. సమస్యను సంబంధిత జలమండలి సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేసి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రాష్ట్ర బంద్‌తో చరిత్ర సృష్టించాం

లాలాపేట: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ చేపట్టిన రాష్ట్ర బంద్ విజయవంతంతో చరిత్ర సృష్టించామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారంలో ఓయూ క్యాంపస్‌లో బీసీ విద్యార్థి సంఘాలతో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. శనివారం జరిగిన బీసీ రాష్ట్ర బంద్ ఒక ట్రైలర్ మాత్రమే అని అన్నారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించే వరకు తెలంగాణ ఉద్యమం తరహాల్లో బీసీ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర బంద్‌ను చూసైనా కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ ప్రక్రియను మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. దీపావళి పండుగ తర్వాత బీసీ జేఏసీ సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఓయూ బీసీ విద్యార్థి సంఘం ఇన్‌చార్జి బొల్లెపల్లి స్వామిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం, కుందారం గణేశ్‌చారీ, బీసీ జాగృతి అధ్యక్షులు మురళికృష్ణ, శ్రీనివాస్ ముదిరాజ్, శ్యామ్‌కురుమ, మహిళా అధ్యక్షురాలు మణిమంజరీ, మల్లయ్య తదితరులున్నారు.











